రేవతి - ఆది

నానాటి బ్రదుకు - నాటకము
కానక కన్నది - కైవల్యము

పుట్టుటయు నిజము - పోవుటయు నిజము
నట్ట నడిమి పని - నాటకము
ఎట్ట నెదుట గల - దీ ప్రపంచము
కట్ట కడపటిది - కైవల్యము

కుడిచేదన్నము - కోక చుట్టెడిది
నడుమంత్రపు పని - నాటకము
ఒడి గట్టుకొనిన - ఉభయకర్మంబుల
గడిదాటిన పుడె - కైవల్యము

తెగదు పాపము - తీరదు పుణ్యము
నగి నగి కాలము - నాటకము
ఎగువన శ్రీవేంక -టేశ్వరుడేలిక
గగనము మీదిది - కైవల్యము

జగత్తు అంతా మిధ్య అని వేదాలు ఉద్ఘోషిస్తున్నాయి. నరుల దినదినపు జీవన విధానమంతా మాయ అనే తెరవెనుక జరుగుతున్న నాటకమే. నైసర్గిక దృష్టితో చూడగలిగింది ఈ నాటకం మాత్రమే. జ్ఞాన దృక్కులతో, అంతర్ముఖమైన దృష్టితో మాత్రమే కైవల్య మార్గం గోచరిస్తుంది.

మానవ దృష్టికి, పంచేంద్రియ జ్ఞానానికి గోచరించేది అధిభౌతికమైన సాపేక్షమైన సత్యం అందువల్ల జనన మరణాలు ( ఈ పరిధిలో) సత్యమే. జన్మాది మరణ పర్యంతం జరుగుతున్నది మట్టుకు నాటకమే. మనకు ప్రత్యక్షంగా త్రయీమానమై గోచరిస్తున్నది భౌతిక సృష్టి. దీనికన్న అతీతమైనది తురీయమైనది కైవల్యము.

ప్రాణికిగల క్షుద్బాధాదులు, మానవులకుండే వస్త్రధారణాది వ్యామోహాలు - ఇవన్నీ జనన మరణాల మధ్య జరుగుతున్న పనులు - ఇవన్నీ నాటకమే. మాతృ గర్భంలో ఉండగా

నే మూటగట్టుకొన్న ప్రారబ్ధ, సంచితములనే ఉభయ కర్మలవల్ల ఏర్పడే నిర్దిష్ట పరిధిని దాటగలిగితేనే కైవల్యము. లేనియెడ జీవునకు నాటకమే మిగులుతుంది.

ఇక మూడవ కర్మ - ఆగామి - ఉన్నది. దానివల్ల వచ్చే చిక్కులున్నవి. ప్రారబ్ధ సంచిత కర్మలు క్షయం కానీకుండా అడ్డువస్తున్నదది. శ్రీవేంకటేశ్వరుడనే ఆకాశమున్నది. ఆ తిరువేంకటాచలపతి జగదధీశ్వరుడు. ఆయనను చెందగలిగితే ఆ మీదట పొందగలిగినది కైవల్యమే. తన సర్వస్వమూ జీవులాస్వామికి అర్పిస్తే వారి వారి ప్రారబ్ధ సంచిత ఆగామి కర్మలు పూర్ణమై పరిపక్వమై ముక్తి లభిస్తుంది. లేకపోతే ఈ చర్విత చర్వణపు జనన మరణాల సంధిలో జీవుడు గింజుకుంటూనే ఉంటాడు యుగాంతందాకా అని అద్వైత వేదాంతపు జ్ఞాన వైరాగ్య మార్గాన్ని నిర్ధారించారు అన్నమాచార్యులు.